బాధితులకు మంచి చేస్తే అభాండాలా ?

- ప్రజలను మభ్య పెట్టేందుకు మాపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు
- ఉమాపతినాయుడు కబ్జాపై అందరికీ న్యాయం చేశాం
- ఒక్కొక్కరికీ రూ.1.60 లక్షలు అందించాం
- వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి
- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోనిఅర్బన్: బాధితులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో మంచి చేశామని, తమపైనే కబ్జా అభాండాలు వేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. తనపై, తనయుడిపై కబ్జా ఆరోపణలు చేస్తూ మభ్యపెట్టాలని చేస్తే సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 352 సర్వే నంబర్‌లోని భూమిలో 2017లో ఉమాపతినాయుడు కబ్జా చేశారని దీనిపై 200 మంది బాధితులు తన వద్దకు వచ్చి న్యాయం చేయాలని కోరారన్నారు. తమ ప్రభుత్వం వచ్చినప్పుడు తప్పకుండా న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరోసారి బాధితులు న్యాయం చేయాలని తనను కోరారన్నారు. తగిన చర్యలు తీసుకొని 350 సర్వే నంబర్‌లోని భూమిని వారికి ఇచ్చేందుకు కృషి చేశానని చెప్పారు. ఇందులో నాలుగు ఎకరాల్లో 421 మందికి అమీద్, అబీద్ అనే వ్యక్తులు డబుల్ రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిసిందన్నారు. బాధితులకు న్యాయం చేయాలంటే మొత్తం భూమి ఒకరి పేరిట ఉంటే కుదురుతుందని తెలుసుకొని, ఈ భూమిని కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పార్టీలోని నాయకులతో చర్చించగా రామకృష్ణ అనే వ్యక్తి ముందుకొచ్చాడని తెలిపారు. ఆయన నుంచి ఒక్కో బాధితుడికి రూ.1.60 లక్షలు ఇప్పించి న్యాయం చేశామని వివరించారు.

దత్తా అనే బాధితుడు మోసపోయాడు

గత వారంలో దత్తా అనే బాధితుడు 352 సర్వే నంబర్‌లోని ఆయన భూమి కబ్జాకు గురైందని ఆత్మహత్యకు ప్రయత్నించాడని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. దత్తా భూమిని అమీద్ అనే వ్యక్తి డూప్లికేట్ చేసి మోసం చేశాడన్నారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తెప్పించి చూస్తే దత్తాకు డూప్లికేట్ రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలిందన్నారు. దత్తా తన వద్దకు వచ్చి న్యాయం చేయాలని కోరాడన్నారు. ఏదైనా తెలుసుకొని మాట్లాడాలే గానీ ప్రజలను మభ్యపెట్టేలా మీడియా ముందు తనపై, తన తనయుడిపై మాట్లాడడు సబబుకాదన్నారు.

రాజకీయాల్లోకి రాక ముందు నుంచే భూస్వాములం – ఎమ్మెల్యే

తాము రాజకీయాల్లోకి రాక ముందునుంచే భూస్వాములమని, ఒకరి కడుపు కొట్టాల్సిన అవసరం తమకు లేదన్నారు. బాధితులకు తన వంతుగా సాయం చేస్తాను గానీ ఇలాంటి భూదందాలు, కబ్జాలు చేసే అలవాటు లేదని చెప్పారు. ఇది టీడీపీ వారికే ఉందని, ఎల్లో మీడియా తనపై, తన తనయుడిపై దుష్ప్రచారాలు మానుకోవాలని, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తమపై బురదజల్లాలనే ఉద్దేశంతో కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.

బైపాస్ రోడ్డు 70 శాతం పూర్తి

బైపాస్ రోడ్డుకు సంబంధించిన పనులు, ల్యాండ్ అక్విడేషన్ 70 శాతం పూర్తయ్యిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇది కేంద్ర హైవే రోడ్డు అని, ఎవరికి సంబంధం ఉండదని, బైపాస్ రోడ్డు ఆగిపోయిందనే దుష్ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. నీలకంఠేశ్వర ఆలయ భూమి పోయినా దానికి సంబంధించిన ఎంత భూమి పోయిందో అంతే భూమి వేరే చోట ఇస్తారని తెలిపారు. లేకపోతే అందుకు పరిహారం చెల్లిస్తారన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, నాయకుడు రామకృష్ణారెడ్డి, బాధితుడు దత్తా పాల్గొన్నారు.

నిజం తెలియక ఆరోపణలు

అమీద్ అనే డూప్లికేట్ వ్యక్తి నన్ను నమ్మించి 50 సెంట్ల భూమిని సర్వే నంబర్ 352లో రిజిస్ట్రేషన్ చేశాడు. అది నాదనుకొని కబ్జా చేశారని, పురుగు మందు సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించాను. వైఎస్సార్‌సీపీ నాయకులపై తెలియక మాట్లాడాను. ఇప్పటికైనా అమీద్‌తో డబ్బు ఇప్పించి న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరాను.

– దత్తా, బాధితుడు

ఉచిత శిక్షణ


బాక్సింగ్ క్రీడా పరికరాలను అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐ కాకుబాల్ నగేష్

ఆదోనిఅర్బన్: ఆదోని రీక్రియేషన్ క్లబ్ అశ్వత్థ నారాయణ దేవాలయం కళాభారత్ సేవా సమితి ఆధ్వర్యంలో దసరా పండగ సందర్భాన్ని పురస్కరించుకుని కరాటే, యోగా, బాక్సింగ్ వెపన్స్ కర్రసాము వంటి అంశాల్లో ఉచిత శిక్షణ చేపట్టారు. కార్యక్రమాన్ని ఆర్యవైశ్య మాజీ అధ్యక్షుడు, ఎన్‌ఆర్‌ఐ కాకుబాల్ నగేష్ ప్రారంభించి బాక్సింగ్‌కు సంబంధించిన క్రీడా పరికరాలను ఆదివారం వితరణ చేశారు. సేవా దృక్పథం కలిగిన ఏ కార్యక్రమానికైనా ఆదోనిలో తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని, శిక్షణ పిల్లలకు ఎంతో ఉపయోగకరమన్నారు. రిటైర్డ్ ఇన్‌కం ట్యాక్స్ ఆఫీసర్ సీఆర్ స్వామి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని, మనిషి జీవనాన్ని ఉత్సాహంగా చేస్తాయని తెలిపారు. మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి గుడికల్ కుమారస్వామి, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షులు తలారి ఆంజనేయులు, ఈరన్న, ప్రతాప్‌స్వామి, కేశవ మాస్టర్, శివకుమార్, చందు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రారంభోత్సవానికి సిద్ధం


కోసిగిలో నిర్మాణం పూర్తయిన ఆర్బీకే భవనం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని భూగేని చెరువు సమీపంలో రైతు భరోసా కేంద్రం-2 భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కోసిగి మండలానికి 16 ఆర్బీకేలను ప్రభుత్వం కేటాయించింది. ఆర్బీకే కార్యాలయంతో పాటు గోడౌన్లుగా రైతులకు అందుబాటులో ఉండేలా నిర్మాణాలు చేపడుతున్నారు. ఒక్కో భవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ.21.50 లక్షలు కేటాయించింది. మండలంలో ఇది వరకే దుద్ది రైతు భరోసా కేంద్రం ప్రారంభం కాగా కోసిగి -2 ఆర్బీకే భవన నిర్మాణం పూర్తి చేశారు. త్వరలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించనున్నట్లు అధికారులు, కాంట్రాక్టర్లు తెలిపారు. కార్యాలయం పూర్తయితే రైతులకు సమావేశ భవనంతో పాటు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, వివిధ నమూనా పరికరాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం


దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న అర్చకుడు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం భక్తులు విరాళం అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. కర్ణాటకలోని శిరుగుప్ప వాస్తవ్యులు పల్లవి, శేఖర్ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.50,001 నగదును ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు చెప్పారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి, స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామి వారి శేషవస్త్రాలు, లడ్డూలు, బాండు, ఫొటోను అందజేశారు. భక్తులు విరివిగా విరాళాలు అందించి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని వారు కోరారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్


నిందితుడిని చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ హరికృష్ణ

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఆటో స్టాండు వద్ద ఆదివారం తనిఖీలు చేస్తుండగా పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారని సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. వారి వద్ద ఉన్న బ్యాగులో 4 ఓసీ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం బాక్సులు ఉండడంతో స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడు బోయ నాగరాజు పట్టుబడగా, మరో వ్యక్తి బోయ నాగిరెడ్డి తప్పించుకుని పారిపోయాడన్నారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఆదోని సెబ్ ఎస్‌ఐ హరికృష్ణ, ఎస్‌ఐ శివప్రసాద్, పీసీ శ్రీనివాస్, సుధాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కోసిగిలో సినీ నటుల సందడి


అభిమానులతో నటుడు విక్రమ్


శ్రీమఠంలో రచ్చరవి కుటుంబ సభ్యులు

కోసిగి: మండల కేంద్రంలో సినీ యాక్టర్స్ సందడి చేశారు. విలన్ నటుడు విక్రమ్, జబర్దస్త్ కమెడియన్ రచ్చరవి కోసిగి మీదుగా మంత్రాలయం వెళ్లి రంగప్ప గట్టు ప్రాంతంలో అభిమానులతో కలిసి కాసేపు ముచ్చటించి సెల్ఫీలు దిగారు. కౌతాళం మండలం ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకుని మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వెళుతూ కోసిగిలో అభిమానులను కలిశారు.

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు జబర్దస్త్ హాస్యనటుడు రచ్చరవి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి బృందావనంను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కులగణన చర్యలపై హర్షం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోనిఅర్బన్: ఎన్నో యేళ్ల నుంచి నిలిచిపోయిన, కులగణన చేపట్టాలని ధైర్యంగా అసెంబ్లీలో రిజర్వేషన్ పాస్ చేసి ముందుకెళ్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 139 కులాల తరఫున ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే నెల 18వ తేదీ నుంచి కులగణన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 1931లో ఒకసారి జరిగిందని, మళ్లీ పది సంవత్సరాల తర్వాత 1941లో జరిగిందని, రెండో ప్రపంచ యుద్ధం రావడంతో అప్పటి నుంచి కులగణన జరగలేదన్నారు. మళ్లీ ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధైర్యంగా నిలబడి అసెంబ్లీలో కులగణను సంబంధించిన రిజర్వేషన్ పాస్ చేసి తగిన చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. కులగణన వల్ల 139 కులాల్లో ఎవరు ఎంత మంది ఉన్నారు. ఎవరికి ఎంత రిజర్వేషన్ ఉంటుందని స్వచ్ఛందంగా బయట పడుతుందన్నారు. ఇంతటి మహత్తర కార్యక్రమం నవంబర్ 18వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, ఇందుకు కృషి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

హైదరాబాద్‌కు బస్సు సర్వీసు ప్రారంభం


జెండా ఊపి బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోని సెంట్రల్: ఆదోని నుంచి హైదరాబాద్‌కు స్టార్ లైనర్ స్లీపర్ కోచ్ బస్సును ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ ఆదివారం ప్రారంభించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు ఆర్టీసీ స్లీపర్ బస్సు నడపడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిపో మేనేజర్ మహమ్మద్ రఫిక్ మాట్లాడుతూ గతంలో స్లీపర్ కోచ్ బస్సు వారంలో మూడు రోజులు మాత్రమే నడిచేదన్నారు. ఇకపై రెగ్యులర్‌గా బస్సును నడుపుతామని తెలిపారు. ఆదోని నుంచి 6484 నంబర్ బస్సు రాత్రి 10 గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌లో 6485 నంబర్ బస్సు 8 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. ప్రయాణికులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లోనూ టికెట్లు పొందవచ్చన్నారు. ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఠాధిపతిపై ఆరోపణలు సరికాదు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుభుధేంద్ర తీర్థ స్వామి వారిపై టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదని వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు గోరుకల్లు కృష్ణస్వామి అన్నారు. ఆదివారం స్థానిక ఓ ప్రైవేటు వసతి గృహం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కోవిడ్ సమయం నుంచి గర్భగుడి (బృందావన) దర్శనానికి నిర్ణీత సంఖ్యలో భక్తులకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని గమనించకుండా శనివారం రోజు టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో కలిసి వచ్చి గర్భగుడి దర్శనానికి వదలాలని కోరగా ఒక్కరిని మాత్రమే అనుమతిస్తామని శ్రీమఠం అధికారులు చెప్పడంతో అసహనంతో వెనక్కి వెళ్లిపోయారన్నారు. ఆ తర్వాత పీఠాధిపతిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారన్నారు. పీఠాధిపతా లేక వైఎస్సార్‌సీపీ ఏజెంటా అని మాట్లాడటమే కాకుండా ఆస్తులు కూడబెట్టారని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. లోకేష్ యువగళం యాత్ర సమయంలో, గత నెలలో ఎమ్మెల్సీ సోమిశెట్టి, తిక్కారెడ్డి దర్శనాలు చేసుకోలేదా అని ప్రశ్నించారు. పీఠాధిపతి గురించి మరోసారి అసత్య ఆరోపణలు చేస్తే బుద్ధి చెపాల్సి వస్తుందన్నారు. వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, సచివాలయ మండల కో కన్వీనర్ వీకేసీ రాఘవేంద్రాచారి, ఉప సర్పంచ్ పరమేష్, నాయకులు వెంకటేష్ శెట్టి, శివకుమార్, జిమ్మి, శంకర్, సోమిరెడ్డి, వెంకటరెడ్డి, భాస్కర్, రాము, వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

పాముకాటుతో బాలుడి మృతి

ఆదోనిఅర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన రామకృష్ణ (15) అనే బాలుడు ఆదివారం పాముకాటుతో మృతిచెందాడు. మృతుడి తండ్రి నగేష్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని దొడ్డనగేరి గ్రామంలో పొలానికి బాలుడు వెళ్లాడు. అక్కడ పాముకాటు వేయడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు.


మృతిచెందిన బాలుడు రామకృష్ణ



ఆ గురువులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

ఆదోనిఅర్బన్: పట్టణంలోని మిల్టన్ ప్రయివేట్ పాఠశాలకు చెందిన 1998 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. స్థానిక ఆ పాఠశాల వేదికగా చేసుకొని పూర్వ విద్యార్థులు తిరిగి కలుసుకున్నారు. పాఠశాలలో కలియతిరిగి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వివిధ స్థాయిలో, వివిధ దేశాలు, రాష్ట్రాల్లో స్థిరపడిన వారంతా ఒక్కసారిగా కలుసుకొని సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మోహన్, నూర్, వెంకటేష్, బ్రహ్మానందరెడ్డి, ఈరన్న, పరమేశప్ప, ఈశ్వరప్పలకు సన్మానం చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తమను గుర్తు పెట్టుకొని ఈ శుభదినం రోజు తమ ను సన్మానం చేసి ఆశీర్వాదం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు అబ్దుల్లా, అశోక్, రఘువీర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి సురక్ష వైద్య శిబిరాల షెడ్యూలు

ఆదోని సెంట్రల్: ప్రతి వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యంగా జీవించేలా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామ/వార్డు సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి వైద్య శిబిరాలకు వచ్చి డాక్టర్లు దగ్గర మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచిస్తున్నారు. అందులో భాగంగానే సోమవారం ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో జరిగే వైద్య శిబిరాల షెడ్యూల్ వివరాలను అధికారులు ఆదివారం వెల్లడించారు.

మండలం	గ్రామం	స్థలం	డాక్టర్
ఆదోని	పెద్దతుంబళం-2	గ్రామ సచివాలయం	నిలోఫర్ భాను
కౌతాళం	ఎరిగేరి	గ్రామ సచివాలయం	టి.ఇమ్మానియేల్ రాజు
మంత్రాలయం	వగరూరు	వి.తిమ్మాపురం గ్రామం	ఎం.భావన

నిందితులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

ఆదోనిరూరల్: కౌతాళం మండలం బాపురం గ్రామానికి చెందిన లక్ష్మి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రి ముందు లక్ష్మి మృతదేహాన్ని పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నెల 13వ తేదీన లక్ష్మి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు కౌతాళం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఉదయం 6 గటల సమయంలో గ్రామ చెరువులో ఆమె శవమై కనిపించిందన్నారు. ప్రేమ పేరుతో హింసించి పెళ్లి చేసుకోకుండా ఆమె జీవితాన్ని నాశనం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మాల మహానాడు సీనియర్ నాయకులు జట్టప్ప గారి వీరేష్, ఆస్పరి మండల కన్వీనర్ భరత్, గోనెహాల్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్‌రాముడు, బసాపురం ఈరన్న, శేఖర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కౌతాళం: మండల పరిధిలోని కామవరం గ్రామంలో సోమవారం.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు గ్రామ సర్పంచ్ వసంత, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, మాజీ సర్పంచ్ అవతారం తెలిపారు. కార్యక్రమానికి ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌తో పాటు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హాజరవుతున్నట్లు వెల్లడించారు. ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభకు హాజరుకావాలని కోరారు.

జమ్మి మహంకాళమ్మకు ప్రత్యేక పూజలు


మహంకాళమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

ఆదోనిరూరల్: మేజర్ పంచాయతీ మండిగిరిలోని భరత్‌నగర్‌లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జమ్మి మహంకాళమ్మ మొదటి కళ్యాణ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జమ్మి చెట్టు చుట్టూ కట్ట నిర్మించి తెల్లవారుజామున 5 గంటల నుంచి కళ్యాణోత్సవం జరిపారు. కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించారు. జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే తనయుడు జయమనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి అన్నదానం చేశా రు. నిర్వాహకులు, పూజారి దాస్, ఉషా, నాగరాజ్, ఈరన్న, ఈశ్వర్, వెంకటేష్, కన్నా, దుమ్మరి లక్ష్మన్న, తురువగల్ రాజు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతా.. నమోస్తుతే !


పసుపు, కుంకుమ అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ


బాలాత్రిపుర సుందరిగా అంబాభవానీ శక్తిమాత


వాసవీమాత ఆలయంలో కొలువుదీరిన బాలాత్రిపురేశ్వరి దేవి


వేరుశనగ విత్తన అలంకరణలో పేట వీరభద్రేశ్వరస్వామి


కందుకూరులో శైలపుత్రి అలంకరణలో శాంభవి దేవి


మంత్రాలయంలో బాలత్రిపుర సుందరీ దేవికి పూజలు

ఆదోనిఅర్బన్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం పట్టణంలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి దేవాలయాల్లో ఆలయ నిర్వాహకులు ఆయా రూపాల్లో అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే పట్టణంలో 22 దుర్గామాత విగ్రహాలను ఆయా వీధుల్లో కొలువుదీరారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కొన్ని ఆలయాల్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, దేవుళ్ల గురించి చిన్నారులు, మహిళలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

మంత్రాలయం: మంత్రాలయంలో దేవి శరనవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వాసవి దేవస్థానం సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారు మొదటి రోజు బాలత్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి పురోహితుడు గౌతమ్ స్వామి ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్‌శెట్టి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతి ఘటస్థాపన పూజ కార్యక్రమాలు నిర్వహించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. గ్రామ దేవత మంచాలమ్మను కొబ్బరికాయలతో అలంకరించారు. పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.